క్లుప్తంగా

ఆ.. కూటమికి మైనార్టీలు బుద్ధిచెప్పాలి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట రూరల్: ముస్లిం రిజర్వేషన్ తొలగించే కుట్ర చేస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి మైనార్టీలు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. బుధవారం రాత్రి దొండపాడులో గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు గది, చినతురకపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్, ఉర్దూ పాఠశాలలో అదనపు తరగతి గదులు, జలజీవన్ మిషన్‌లో ఇంటింటికి కుళాయి కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్ తొలగిస్తామని ప్రకటిస్తున్న బీజేపీ నాయకులకు, వారికి మద్దతిస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు బుద్ధి చెప్పాలని మైనార్టీలకు పిలుపునిచ్చారు. టీడీపీకి ఓటు వేస్తే బీజేపీ ఓటు వేసినట్టే అని, తద్వారా ముస్లిం రిజర్వేషన్ రద్దుకు మద్దతు తెలిపిన వారవుతారని తెలిపారు. మైనార్టీలు ఈ విషయాన్ని గుర్తుచేసుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ఓడించడం ద్వారా బుద్ధి చెప్పాలని తెలిపారు. చినతురకపాలెంలో షాదీఖానా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే షాదీఖానాను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ విభాగ నేతగా మౌలాలి



చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన షేక్ మౌలాలి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఇప్పటికే ఆయన పదోవార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన నియామకం పట్ల పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

వర్సిటీ టీంకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి బి.రామ్‌జీనాయక్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రోప్ స్కిప్పింగ్ టీంకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రోప్ స్కిప్పింగ్ వర్సిటీ టీం ఎంపిక పోటీలలో రామ్‌జీనాయక్ ప్రతిభ కనపరిచి ఎంపికై నట్టు వివరించారు. త్వరలో మధ్యప్రదేశ్ భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ విశ్వవిద్యాలయంలో జరగనున్న జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల రోప్ స్కిప్పింగ్ పోటీలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. రామ్‌జీ నాయక్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, అధ్యాపకులు అభినందించారు.

నేడు చందవరంలో వైద్యశిబిరం

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే క్యాంపుకు నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యులతో పాటూ స్పెషలిస్ట్ వైద్యులు హాజరౌతారన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వకండి

నాదెండ్ల: వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండల పరిషత కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా గ్రామాల్లో నీటి ఎద్దడి పొంచి ఉన్నట్లయితే బోర్లు రిపేర్లు చేయించి నీటిని వినియోగించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లోని పోలింగ్ బూత్ ల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వారితో పాటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికలు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలందరు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టరు వరదా సుబ్బారావు అన్నారు. గురువారం కనమర్లపూడి, శావల్యాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా 34 పోలింగ్ కేంద్రాల్లో అన్నీ మౌలిక వసతులు సక్రమంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్యకు సూచనలు సలహాలు ఇచ్చారు.

అందరం సమష్టిగా పనిచేద్దాం

- వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుదాం
- నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ పిలుపు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోసం పనిచేసే సమయం ఆసన్నమైందని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పట్టణంలోని బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాట్లు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పి.అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు పక్కనబెట్టి పార్టీ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు చంద్రబాబు, లోకేష్‌ల డైరెక్షన్‌లో కుట్ర జరుగుతోందన్నారు. పచ్చమీడియా ద్వారా అసభ్య, అసత్య ప్రచారాలతోపాటు, భయాందోళనలకు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.

ప్రజలు సంయమనం పాటించి వారి కుట్రలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వినుకొండ నియోజకవర్గంలో కార్యకర్తలపై దాడులు చేస్తే సహించమన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు, వారి ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి పగ్గాలు చేపడతారన్నారు. వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని, రాష్ట్రంలోనే పేరుండేలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ.. నువ్వెన్ని ఇళ్లపట్టాలిచ్చావో చెప్పు?

- ప్రశ్నించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పట్టణంలోని వరవకట్టలో 232 మందికి రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేత



వరవకట్టలో రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కార్యక్రమానికి హాజరైన మహిళలు

నరసరావుపేట: రాష్ట్రానికి 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఎంతమంది పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చాడో చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ నాయకులను కోరారు. గురువారం పట్టణంలోని వరవకట్టలో 15,17 వార్డులకు చెందిన 232 మంది జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి 32 లక్షల మంది పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్లపట్టాలు అందజేశారన్నారు. 70 ఏళ్ల రాష్ట్రచరిత్రలో సీఎం జగన్ తప్పితే మరెవరూ చేయలేదన్నారు. పట్టణంలోని లబ్ధిదారుల కోసం 157 ఎకరాల కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. పేదవారు ఇళ్లు కట్టుకునేందుకు ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షలు చొప్పున ఇచ్చారన్నారు. రెండు వార్డులపై రూ.24 కోట్ల సంక్షేమం అందజేశామన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి చేశామన్నారు. ఎన్‌టీఆర్ పేరు చెబితే రూ.2ల కిలోబియ్యం, వైఎస్సార్ పేరు చెబితే ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్ గుర్తుకొస్తాయన్నారు. సీఎం జగన్ పేరుచెబితే అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత గుర్తుకొస్తాయన్నారు. సీఎం జగన్ రూ.26 వేల కోట్లు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశాడన్నారు. మానిఫెస్టో సీఎం జగన్ 98 శాతం పూర్తిచేస్తే చంద్రబాబు పదిశాతం కూడా పూర్తి చేయలేదన్నారు. వలంటీరు వ్యవస్థ కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలన్నారు. టీడీపీ నాయకులు 2018లో వార్డు పరిధిలోని జామియా మసీదు, షాపింగ్ కాంప్లెక్స్‌లను కూలగొట్టి నిర్మాణం చేయకుండా చేతులెత్తేశారన్నారు. తాము అధికారంలోకి రాగానే జామియా మసీదు నిర్మాణం చేపట్టామని రంజాన్ నాటికి పూర్తిచేసి ఇస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ ప్యాకేజ్ కోసమే చంద్రబాబుతో జతకట్టాడన్నారు. సైకిలు ఎక్కమంటే ఎక్కుతాడు, దిగమంటే దిగుతాడన్నారు. సొంతంగా బీజేపీ తో కలిసి జనసేన పోటీచేసి ఉంటే వారికి గౌరవం దక్కేదన్నారు. బీజేపీని కూడా కలుపుకున్న చంద్రబాబు నాలుగుశాతం ముస్లిం రిజర్వేషన్ తీసేస్తున్నాడన్నారు. ముస్లింలు తెలుగుదేశంకు ఓటు వేస్తే బీజేపీకి ఓటువేసినట్లేనని అన్నారు. వారి పిల్లల భవిష్యత్ అంధకారమౌతుందన్నారు. సీఎం జగన్ ఉంటే రిజర్వేషన్ కొనసాగుతుందని, వలంటీరు వ్యవస్థ ఉంటుందన్నారు. ఎంపీగా పోటీచేసే అనీల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేగా పోటీచేసే తనకు బటన్ నొక్కి ఓటువేసి మద్దతు తెలియచేయాలని కోరారు. అనంతరం జామియా మసీదు నిర్మాణ పనులను పరిశీలించారు. మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, ముదిరాజు, స్వచ్ఛాంధ్ర, మాదిగ కార్పొరేషన్ల డైరక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, ఎజ్రా, వరవకట్టబాబు, కరిముల్లా పాల్గొన్నారు.

కృతజ్ఞత చెప్పాల్సిన సమయమిది

సహాయం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్చిపోకుండా ఓటు రూపంలో కృతజ్ఞత తెలియచేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. గురువారం ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో 74 మందికి రూ.63.48 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.9.45 కోట్లు సీఎం రిలీఫ్‌ఫండ్ ఇవ్వటం జరిగిందన్నారు. మీకు తోడుగా ఉన్నదెవరు, ఇబ్బంది వస్తే నీడగా ఉన్నదెవరో గుర్తుంచుకోవాలన్నారు. నిజమైన పాలనకు, అవినీతి పాలనకు తేడా గమనించాలని, తేడా చేసేవారిని రాష్ట్ర పొలిమేరకు తరిమికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయటం మన ధ్యేయం కావాలన్నారు. నరసరావుపేటలో తాను హ్యాట్రిక్ విజయం సాధించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరారు.

ప్రజాసంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడ్డ సీఎం జగన్

రొంపిచర్ల: ప్రజాసంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వడ్లమూడివారిపాలెం, ముత్తనపల్లి గ్రామాల్లో గురువారం సాయంత్రం పర్యటించి ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ముత్తనపల్లి గ్రామంలో 132మంది నిరుపేదలకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తారన్నారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రామానికి వచ్చిన డాక్టర్ గోపిరెడ్డి బృందానికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కొణతం శ్రీను, అశోక్, కోటయ్య, గానుగపంట ఉత్తమరెడ్డి, అన్నెంపున్నారెడ్డి, ముక్కాల వెంకటరెడ్డి, పల్లపు అంజయ్య, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, పడాల చక్రారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, పోతులూరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి చార్జిమెమో



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: పదిరోజుల క్రితం ఉన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించని అధికారులు, సిబ్బందికి చార్జి మెమో ఇస్తూ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 22, 24 వార్డులలో పర్యటించారు. పది రోజుల క్రితం ఇదే వార్డులకు వచ్చినప్పుడు ఏ సమస్యలు ఉన్నాయో వాటిని క్లియర్ చేయమని చెప్పారు. పది రోజుల తర్వాత కూడా అదే విధంగా సమస్య ఉండడం గమనించి వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమోలు జారీ చేశారు. శానిటేషన్ అధికారులతో మాట్లాడుతూ చెత్త ఏ రోజుకి ఆ రోజు పూర్తి గా తొలగించాలని, మధ్యాహ్నం వేళలో కాలువలు పూడిక తీసేవిధంగా చర్యలు తీసుకోవాలని, దోమలు నివారణకు ఫాగింగ్ వారానికి మూడు రోజులు ప్రతి వార్డులో చేయాలని సూచించారు. ఆ పనులు చేశారో లేదో సంబంధిత వార్డు ఇన్‌చార్జి, వార్డులోని పుర ప్రముఖుల వద్ద సంతకాలను సేకరణ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని సూచించారు. మరి ముఖ్యంగా ఎన్నికల దగ్గర పడుతున్న వేళ ప్రతి ఒక్క పట్టణ పౌరుడు తమ ఓటు వియోగించు కోవడానికి పోలింగ్ బూత్ వద్ద రావడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ సంబంధించి ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులు తరుచుగా పట్టణం నందు విజిట్ చేయ డం జరుగుతుందన్నారు. ఏ వార్డు నుంచి అయినా ప్రజలవద్ద నుంచి శానిటేషన్‌కు సంబంధించి సమస్యలు రాకూడదని, వచ్చినట్లయితే సంబంధిత శానిటేషన్ సెక్రెటరీలను సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉబకాయునికి అత్యాధునిక చికిత్స

- మాక్స్‌కేర్ సాయి తిరుమల హాస్పిటల్‌లో వైద్యం చేసిన డాక్టర్ మన్నే గౌతమ్



చికిత్స చేస్తున్న డాక్టర్ మన్నేగౌతమ్

నరసరావుపేట: స్థానిక మాక్స్‌కేర్ సాయి తిరుమల హాస్పిటల్‌లో గురువారం మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ మన్నేగౌతమ్ అత్యాధునికమైన ఇంట్రా గ్యాస్టిక్ బెలూన్ విధానం ద్వారా ఉబకాయంతో బాధపడుతున్న ఓ యువకుడికి కోత, కుట్లు లేకుండానే ఒకేరోజు విజయవంతంగా చికిత్స చేసి ఇంటికి పంపినట్లు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వై.వెంకటరామయ్య తెలిపారు. ఆధునిక జీవన విధానంలో తినేతిండితో సరైన వ్యాయామంలేక పోవటం ద్వారా యువత ఉబకాయంతో బాధపడుతున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఆధునిక చికిత్సా విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. దీని ద్వారా నరసరావుపేట చరిత్రలో తొలిసారిగా 33 ఏళ్ల యువకుడికి చికిత్స అందించామన్నారు. ఈ సేవలు తమ వైద్యశాలలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా, పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాసంఘాల నిరసన

నరసరావుపేట: కేంద్రంలోని నరేంద్ర మోడీ, అమిత్ షాల బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మార్కెట్ యార్డ్ వద్ద ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చందాల రూపంలో వచ్చిన ఎన్నికల బాండ్లు వివరాలను చెప్పాలని బ్యాంకులను సుప్రీంకోర్టు ఆదేశించిన సందర్భంలో తమ పాపాల పుట్ట ఎక్కడ బద్దలవుతుందోనని ఈ విషయాన్ని డైవర్ట్ చేయడం కోసం సీఏఏను ఎజెండాలోకి బీజేపీ తెచ్చిందన్నారు. హిందుత్వాన్ని రెచ్చగొట్టడం పట్ల దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోడీకి వ్యతిరేకంగా, సీఏఏకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు.కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ దేశ ప్రజలను చిన్నాభిన్నం చేసేందుకు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్ల కోసం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని దీనిపట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. భారత్ బచావో పల్నాడు జిల్లా అధ్యక్షులు వి.కోట నాయక్, ఎంఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పీకేఎస్ జిల్లా నాయకులు కంబాల ఏడుకొండలు, పౌరహక్కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారు

నరసరావుపేట: నేటితరం మహిళలు తమదైన శైలిలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పల్నాడు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ డిపో ఆవరణలోని ప్రజారవాణా అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తమ విభాగంలో మహిళలు కండక్టర్లు, సూపర్‌వైజర్లు, వివిధ హోదాల్లో బాధ్యతలు అద్భుతంగా నిర్వహిస్తున్నారన్నారు. చిలకలూరిపేటకు చెందిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి మాట్లాడుతూ తాను వ్యక్తిగతంగా విద్యార్థినిగా టాపర్‌గా ఉండేదానినని, ఇప్పుడు ఒక గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తూనే డైనమిక్‌గా ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నానన్నారు. నీతి, నిజాయతీలతో బాధ్యతగా విధులు నిర్వహిస్తే అవే రక్షిస్తాయని పేర్కొన్నారు. హిందూ స్కూలు డైరక్టర్ పి.మానస మాట్లాడుతూ మహిళలు బహుళ రంగాల్లో రాణిస్తూ విజయాలు సాధిస్తున్నారన్నారు. ఉత్తమ ఉద్యోగులకు సన్మానం చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.వీరాస్వామి, అకౌంట్స్ ఆఫీసర్ ఎం.వి.రావు, పీడీ ఇన్‌చార్జి ఎంజీవీ ప్రసాదు, మెడికల్ ఆఫీసర్ ఎస్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

వినుకొండలో మహిళా దినోత్సవం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జాషువా కళాప్రాంగణ ఆవరణలో వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్నిరంగాల్లో సమానత్వాన్ని సాధించడానికి, వివక్షతను రూపమాపడానికి , సాధికారతను సాధించడానికి, గుర్తుగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని సీడీపీవో అనురాధ అన్నారు.

బైబై 'జూనియర్'..



గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో ఈ నెల 1 నుంచి జరుగుతున్న ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. పరీక్షలు పూర్తి కావడంతో మధ్యాహ్నం విద్యార్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చివరిరోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. 387 మందికి గాను 10 మంది గైర్హాజరు కాగా 377 మంది పరీక్షలకు హాజరయ్యారు. నిఘా కెమెరాల మధ్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారంతో సీనియర్ ఇంటర్ పరీక్షలు పూర్తి కానున్నాయి. చీఫ్ సూపరింటెండెంట్‌గా వై.శ్రీలక్ష్మి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా కె.హేమలత, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ చైతన్య పర్యవేక్షించారు.

–నాదెండ్ల

ధైర్యం ఉంటే నన్ను ఎదుర్కోండి

- ప్రజల జోలికి వస్తే చూస్తూ ఊరుకోను
- హెచ్చరించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- విగ్రహావిష్కరణ సభలో టీడీపీ గుండాల తీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా తనను ఎదుర్కోవాలని, అమాయక ప్రజల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు హెచ్చరించారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.

వినుకొండలో ఆర్యవైశ్య సోదరులు దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ సభలో టీడీపీ అల్లరిమూకలు చేసిన దాడులను ఖండించారు. మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణమండపంలో కార్యకర్తల మీటింగ్ ఏర్పాటు చేశారని, ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేకపోయినప్పటికీ టీడీపీ కార్యకర్తలతో విగ్రహావిష్కరణ సభ వద్దకు వచ్చి విగ్రహాన్ని ధ్వంసం చేయాలనే దురుద్దేశంతో రాళ్లతో, కర్రలతో దాడులకు పాల్పడ్డారన్నారు. సభలో పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్యులు, రోశయ్య అభిమానులు ఉన్నప్పటికీ దాడులు చేయడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులుగా ఉండి ఇలాంటి పనులు చేయడాన్ని తప్పుబట్టారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఓట్లు వేసిన వారిపైనే రాళ్లు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి గొడవలను ప్రోత్సహించడం టీడీపీకి కూడా భవిష్యత్‌లో నష్టం జరుగుతుందన్నారు. వినుకొండ ప్రజలు ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీలో చేరినప్పటి నుంచి కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారని, వినుకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో అల్లర్లు చేసేందుకు కుట్ర చేస్తున్నట్లు చెప్పారు. గొడవ జరిగే సమయంలో మహిళలు సభలో ఉండటం వల్ల వారికి రక్షణగా వైసీపీ నాయకులు ఉంటే తమపై దాడులు చేశారని టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే సహించేది లేదని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నగేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

రోశయ్య విగ్రహావిష్కరణ సభలో టీడీపీ అల్లమూకల దాడిలో గాయపడిన 9వ వార్డు రెడ్డి నాగపద్మ భర్త రెడ్డి నగేష్‌ను హాస్పిటల్‌లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. ఆర్యవైశ్యులని కూడా చూడకుండా వారిపై రాళ్లు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఇద్దరి వైద్యుల మధ్య అనారోగ్యం!

- యడ్లపాడులో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
- విచారణకు వచ్చిన జిల్లాస్థాయి అధికారులు
- వైద్యుడిని బదిలీ చేయాలంటూ ఏఎన్ఎంల కమిటీ వినతి



విచారణ చేస్తున్న అధికారులు

యడ్లపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం సమస్యల నిలయంగా మారింది. వైద్యులు, సిబ్బంది మధ్య కొనసాగిన కోల్డ్‌వార్ ఆరోపణల హద్దులు దాటి ఫిర్యాదుల స్థాయికి చేరుకుంది. ఆస్పత్రిలో కనీస వసతులు సమకూరడం లేదంటూ సిబ్బంది ఆరోపిస్తుండగా.. అందుకు కావల్సిన నిధులు లేవంటూ వైద్యాధికారి వెల్లడిస్తున్నారు. దీనికితోడు గతంలో ఇక్కడ పనిచేసిన వైద్యుడు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యుడి మధ్య కూడా సమన్వయం లోపించింది. దీంతో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.ప్రభాకరరావు జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నలుగురు అధికారుల బృందం గురువారం యడ్లపాడు పీహెచ్‌సీకు విచారణ నిమిత్తం వచ్చారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు.

గతంలో ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ గోపీ నాయక్‌ను పిలిపించి, ఫిర్యాదు చేసిన వైద్యులు ప్రభాకరరావును విచారించారు. ఈ సందర్భంగా విచారణ కమిటీ హెడ్ జిల్లా లెప్రసీ విభాగం అధికారి డాక్టర్ మురళీకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ పీహెచ్‌సీ నిధులు దుర్వినియోగం జరిగిందని, యంత్రసామగ్రి కొంత అప్పగించ లేదని, సిబ్బంది కూడా తనకు సహకరించడం లేదంటూ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తాము క్షేత్రస్థాయి విచారణకు వచ్చామన్నారు. అయితే నిధులు దుర్వినియోగం ఏమీ లేదని, అప్పగించలేదంటూ చేసిన ఆరోపణకు చెందిన వస్తువులు కూడా ఆస్పత్రిలోనే ఉన్నట్లు గుర్తించామన్నారు. గతంలో ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసిన గోపీ నాయక్, ప్రస్తుతం చేస్తున్న ప్రభాకరరావు మధ్య సమన్వయ లోపమే వివాదాలకు కారణంగా తమ పరిశీలనలో తేలిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బంది ఇబ్బందులను కూడా పరిశీలన చేస్తున్నామని.. విచారణలో గుర్తించిన అన్ని అంశాలను ఉన్నతాధికారులు నివేదించనున్నట్లు చెప్పారు.

వైద్యాధికారిని బదిలీ చేయండి సారూ...

పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.ప్రభాకరరావు తమ విధులకు ఆటంకం కలిగిస్తూ, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడంటూ ముక్తకంఠంగా ఆరోపిస్తూ ఆరోగ్య సిబ్బంది విచారణ బృందం దృష్టికి తెచ్చారు. డీడీఆర్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టడంతో పాటు లైంగిక వేధింపులు చేస్తున్నారని ఏఎన్ఎంలు కమిటీ సభ్యుల ముందు వాపోయారు. పీహెచ్‌సీ నుంచి వెంటనే బదిలీ చేయకుంటే తాము మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

చదువే విద్యార్థులకు విలువైన ఆస్తి

- డీఈవో వెంకటేశ్వర్లు
- ఘనంగా కొండవీడు పీఎంశ్రీ ఎంపీయూపీ స్కూల్ వార్షికోత్సవం



క్యాలీగ్రఫీ పుస్తకాన్ని ఆవిష్కరించిన డీఈవో వెంకటేశ్వర్లు

యడ్లపాడు: విద్యే విలువైన ఆస్తి అని, దానిని అందివ్వడం ద్వారానే గ్రామీణ కుటుంబాల్లోని పేదరికాన్ని తరిమి కొట్టడం సాధ్యపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు చెప్పారు. యడ్లపాడు మండలం కొండవీడు పీఎంశ్రీ ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం వార్షికో త్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సభలో ముఖ్య అతిథి డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుని నడవడిక విద్యార్థులను ఎంతో ప్రభావితం చేస్తుందని, కాబట్టి గురువు ఎప్పుడు విద్యార్థికి దిక్సూచిలా ఉండాలన్నారు. అలాంటి వారిలో కొండవీడు యూపీ స్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఒకరని కొనియాడారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు కేవలం విద్య అందిచడమే కాకుండా వారికి అందమైన చేతిరాత క్యాలీగ్రఫీ శిక్షణ అందించి వండర్ బుక్‌ఆఫ్ రికార్డులో పాఠశాల విద్యార్థుల్ని భాగస్వాముల్ని చేయడం, అలాగే ముంబాయ్‌కు చెందిన కళాసంస్థ రంగోత్సవ్ జాతీయ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించి జాతీయస్థాయి బహుమతుల్ని సాధించేలా కృషి చేయడం పాఠశాల ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఉందన్నారు. అనంతరం ఆయా మెడల్స్‌ని, బహుమతుల్ని హెచ్‌ఎం శ్రీనివాసరావుకు, విద్యార్థులకు అందించారు. క్యాలీగ్రఫీలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు షేక్ జున్నూ సాహెబ్‌కు సత్కరించారు. అనంతరం జున్నూసాహెబ్ క్యాలీగ్రఫీ స్వీయరచన పుస్తకాన్ని డీఈవో ఆవిష్కరించారు. నరసరావుపేట డీవైఈవో వేణుగోపాలరావు, యడ్లపాడు ఎంఈవో -1,2 నాగరత్నం, అరుణకుమారి, ఉపాధ్యాయులు పీ.ఆంజనేయులు, రాజు, సుందరమ్మ, కవిత, నరేంద్ర, స్లీవమ్మ, సమత, చాందిని, పుష్పలీల, లీలేశ్వరీలతో పాటు అతిథుల్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.

నేడు మినీ జాబ్‌మేళా

వినుకొండ(నూజెండ్ల): పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి కె.సంజీవరావు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక డిప్లొమా, ఫార్మసీ, పీజీ కోర్సులు చదివిన 18 నుంచి 35 సంవత్సరాలు గల అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9951214919, 9160200652 నంబర్లను సంప్రదించాలన్నారు.